క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

త్రిపురారం : మిర్యాలగూడ 220–132–33 కేవీ సబ్‌స్టేషన్ నుంచి మండలంలోని మాటూర్ 33కేవీ పరిధిలో విద్యుత్ లైన్‌కు మరమ్మతుల కారణంగా నేడు ఉదయం 7గంటల నుంచి మధ్యాహ్నం 11గంటల వరకు మాటూర్ సబ్ స్టేషన్ పరిధిలోని అన్ని గ్రామాలకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడనున్నట్లు త్రిపురారం విద్యుత్ ఏఈ బాలునాయక్ బుధవారం తెలిపారు. అందుకు వినియోగదారులు విద్యుత్ సిబ్బందికి సహకరించాలని కోరారు.

ఘనంగా రవీంద్రనాథ్ ఠాగూర్ జయంతి



రవీంద్రనాథ్ ఠాగూర్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న అసోసియేషన్ సభ్యులు

దేవరకొండ : పట్టణంలో దేవరకొండ స్పోర్ట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో బుధవారం రవీంద్రనాథ్ ఠాగూర్ 164వ జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అసోసియేషన్ అధ్యక్షుడు ఎస్‌వీటీ ఠాగూర్ చిత్రపటానికి పూలమాలలు వేసి మాట్లాడారు. భారతదేశానికి మొట్టమొదటి నోబుల్ బహుమతి అందించిన గొప్ప వ్యక్తి, విశ్వకవి రవీంద్రనాథ్ ఠాగూర్ అని అన్నారు. కార్యక్రమంలో తాళ్ల శ్రీధర్‌గౌడ్, పంతులాల్, ఎండీ యూనుస్, పొన్నెబోయిన సైదులు, భాస్కర్, రమేష్, ఏడుకొండలు, తదితరులున్నారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కు పంపిణీ



బాధితుడికి చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే

మిర్యాలగూడ టౌన్ : మున్సిపాలిటీలోని 27వ వార్డుకు చెందిన ఎస్‌కె షబ్బీర్ హహమ్మద్‌కు సీఎం సహాయ నిధి నుంచి మంజూరైన రూ.50వేల చెక్కును బుధవారం స్థానిక ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి బాధితుడికి అందజేశారు. కార్యక్రమంలో 27వ వార్డు కాంగ్రెస్ ఇన్‌చార్జ్ గొట్టిముక్కల లక్ష్మణ్, కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు నూకల వేణుగోపాల్‌రెడ్డి, మాజీ కౌన్సిలర్ శేఖర్‌రెడ్డి, నాయకులు తదితరులున్నారు.

దేవాదాయ శాఖ మంత్రికి వినతి

మిర్యాలగూడ టౌన్ : యాదగిరిగుట్ట దేవస్థానం బోర్డు చైర్మన్‌గా బీసీలకు అవకాశం కల్పించాలని కోరుతూ బుధవారం బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి జాజుల లింగంగౌడ్ ఆధ్వర్యంలో రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి కొండ సురేఖకు వినతిపత్రం అందజేశారు. ఉమ్మడి నల్లగొండ జిల్లా వ్యాప్తంగా సర్పంచ్‌ల నుంచి మొదలుకొని మంత్రుల వరకు ఒకే సామాజిక వర్గానికి చెందిన వారే ఉంటున్నారని, బీసీలను ఓట్లు అడిగే యంత్రాలుగానే చూస్తున్నారని, కనీసం యాదగిరిగుట్ట దేవస్థానం చైర్మన్ పదవి అయినా బీసీలకు కేటాయించే విధంగా చూడాలని మంత్రిని కోరారు. వినతిపత్రం అందజేసిన వారిలో తెలంగాణ విద్యార్థి, యువజన పరిషత్ రాష్ట్ర అధ్యక్షుడు బూర శ్రీనివాస్‌గౌడ్, బీసీ విద్యార్థి సంఘం నేత రవీందర్, చంద్రమోహన్‌రాయ్ తదితరులున్నారు.

ఘనంగా వీరబ్రహ్మేంద్రస్వామి ఆరాధన మహోత్సవం



పండ్లు పంపిణీ చేస్తున్న ఆలయ కమిటీ సభ్యులు

కొండమల్లేపల్లి : మండల కేంద్రంలోని హైదరాబాద్ రోడ్డులో మల్లెలగట్టుపై గల శ్రీశ్రీశ్రీ గోవిందమాంబ సమేత శ్రీమద్విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి 332వ ఆరాధన మహోత్సవం బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామి వారికి సుప్రభాత సేవ, గణపతి పూజ, పుణ్యావచనం, మూలమంత్ర యజ్ఞం, పూర్ణాహుతి, మహోత్సవం నిర్వహించారు. అనంతరం స్థానిక చౌరస్తా వద్ద పండ్లు పంపిణీ చేశారు. అదే విధంగా ఆలయంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో పస్నూరి యుగేంధర్‌రెడ్డి, ఉట్కూరి వేమన్‌రెడ్డి, కమిటీ అధ్యక్షుడు కర్నెకంటి జంగాచారి, పస్నూరి నరేందర్‌చారి, మల్లోజు వీరాచారి, అచ్యుతాచారి, అందోజు వెంకటాచారి, బొల్లోజు వెంకటాచారి, పోలోజు శివచారి, నారోజు సైదాచారి, నరసింహాచారి, పస్నూరి సత్యనారాయణచారి, నాగచారి, మినాచారి, సత్తయ్య, విష్ణుమూర్తి తదితరులు పాల్గొన్నారు.

పనుల పరిశీలన

మిర్యాలగూడ టౌన్ : మున్సిపాలిటీలోని 20వ వార్డులో బుధవారం మున్సిపల్ సిబ్బంది డ్రెయినేజీ క్లీనింగ్ పనులు చేపట్టారు. ఈ పనులను స్థానిక మాజీ కౌన్సిలర్ దేశిడి శేఖర్ పరిశీలించి మాట్లాడారు. డ్రెయినేజీ మట్టితో పూడుకుపోయి మురుగునీరు పైకి వస్తుండడంతో ప్రజలు అనేక ఇబ్బందులు పడ్డారని, బీఆర్ఎస్ ప్రభుత్వం పదేళ్ల అధికారంలో ఉన్నప్పటికి డ్రెయినేజీ క్లీనింగ్‌లను చేపట్టలేదన్నారు.

ఎండిపోతున్న పల్లెప్రకృతి వనాలు

- నిర్వహణ లేక పిచ్చిమొక్కలతో దర్శనమిస్తున్న వైనం
- సరిపడా నీరు లేక ఎండిన మొక్కలు



పెద్దవూర పల్లె ప్రకృతి వనంలో ఎండిన చెట్లు



పిచ్చిమొక్కలతో దర్శనమిస్తున్న పల్లె ప్రకృతివనం

పెద్దవూర : పల్లె ప్రజలకు ఆహ్లాదకర వాతావరణం అందించాలనే ఉద్దేశ్యంతో గత బీఆర్ఎస్ ప్రభుత్వం గ్రామాలలో పల్లెప్రకృతి వనాలను ఏర్పాటు చేసింది. వాటి ఏర్పాటు కోసం ప్రత్యేకంగా ఉపాధిహామీ పథకం నుంచి నిధులు కేటాయించారు. పల్లెప్రకృతి వనంలో నీడనిచ్చే మొక్కలు, పూలు, పండ్ల మొక్కలతో పాటు ఆహ్లాదాన్ని పంచే మొక్కలను పెంచాలని ఆదేశాలు జారీ చేసింది. అందుకోసం గ్రామాలలో అనువైన ప్రభుత్వ స్థలాలను గుర్తించాలని ఉన్నతాధికారులు సంబంధిత గ్రామ సర్పంచ్‌లు, కార్యదర్శులు, రెవెన్యూ అధికారులపై ఒత్తిడి తెచ్చారు. ప్రభుత్వం ఉన్నతాధికారుల ఒత్తిడితో పలు ప్రయత్నాలు చేసి స్థలాలను గుర్తించారు. కొన్ని గ్రామ పంచాయతీలో మొక్కలు పెరిగేందుకు అనుకూలమైన స్థలం లేకున్నా పల్లె ప్రకృతి వనాలు ఏర్పాటు చేశారు. ఆ సమయంలో ఏదో తూతూ మంత్రంగా మొక్కలు నాటారు. అనంతరం పల్లెప్రకృతి వనాల్లో నాటిన మొక్కలు కనిపించకుండా పోయాయి. అక్కడ పిచ్చి మొక్కలు పెద్దపెద్ద బండరాళ్లు మాత్రమే ప్రస్తుతం దర్శనమిస్తున్నాయి.

నిర్వహణపై నిర్లక్ష్యం..

2018–19 సంవత్సరంలో ప్రతీ గ్రామంలో ఏర్పాటు చేసిన పల్లెప్రకృతి వనాల నిర్వహణ బాధ్యతలను రెండేళ్ల పాటు ఎన్‌ఆర్‌ఈజీఎస్ అధికారులకు అప్పగించారు. వారి రెండేళ్ల కాల పరిమితి ముగిసిన అనంతరం వాటి నిర్వహణ బాధ్యతలను సంబంధిత గ్రామ సర్పంచ్‌లకు అప్పగించారు. వారు పదవీకాలం ముగిసేంత వరకు కొంత మంది సర్పంచ్‌లు ప్రత్యేక చొరవతో వనాలను కాపాడారు. కాని చాలా గ్రామాల్లో పల్లెప్రకృతి వనాల నిర్వహణ ప్రస్తుతం గాలికి వదిలేశారు. దీంతో ప్రభుత్వ లక్ష్యం నీరుగారుతోంది.

నీళ్లు లేక ఎండుతున్న మొక్కలు..

మండలంలో మొత్తం 26గ్రామపంచాయతీలు ఉండగా ప్రతీ గ్రామంలో పల్లె ప్రకృతి వనం ఏర్పాటు చేశారు. వాటితో పాటు బెట్టెలతండా వద్ద పొట్టిచెల్మ సమీపంలో బృహత్ పల్లె ప్రకృతి వనాలను సైతం ఏర్పాటు చేశారు. ఒక్కొక్క పల్లె ప్రకృతి వనానికి సుమారు రూ.30వేల నుంచి రూ.35వేల వరకు ఖర్చు చేయగా, విస్తీర్ణం ఎక్కువ ఉన్న ప్రకృతి వనానికి రూ.50వేల వరకు ఖర్చు చేశారు. మండలంలో అన్నింటికీ కలిపి సుమారు రూ.12లక్షల వరకు ఖర్చు చేశారు. గత ఎనిమిది నెలలుగా వర్షాలు పడకపోవడంతో గ్రామాల్లో ఏర్పాటు చేసిన పల్లెప్రకృతి వనాలలో మొక్కలు ఎండిపోతున్నాయి. చాలా గ్రామాలలో పల్లె ప్రకృతి వనాలలో డ్రిప్ సిస్టం ఏర్పాటు చేశారు. నీరు లేక ఇవేమీ పనిచేయడం లేదు. సర్పంచ్‌ల పదవీకాలం ముగియడంతో ప్రభుత్వం ప్రత్యేక అధికారులను ఏర్పాటు చేసింది. గ్రామ పంచాయతీలకు నిధుల లేమి ఉండడంతో పంచాయతీ కార్యదర్శులు సైతం మొక్కలను కాపాడలేక పోతున్నారు.

> **గ్రామపంచాయతీలే ప్రకృతి వనాలను చూసుకోవాలి**
>
> పల్లె ప్రకృతి వనాల ఏర్పాటు అనంతరం నిర్వహణ బాధ్యతలను రెండేళ్ల పాటు తమ శాఖ ఉద్యోగులకు అప్పగించారు. కాల పరిమితి అనంతరం వాటి నిర్వహణ బాధ్యతలను సంబంధిత గ్రామపంచాయతీలకు అప్పగించారు. చాలా చోట్ల పల్లె ప్రకృతి వనాల్లో ప్రస్తుతం పిచ్చిమొక్కలు దర్శనమిస్తున్నాయి. వర్షాభావ పరిస్థితులతో వనాలలో నాటిన మొక్కలు ఎండిపోతున్నట్లు తమ దృష్టికి వచ్చింది.
>
> – సుధీర్‌కుమార్, ఇన్‌చార్జ్ ఎంపీడీఓ, పెద్దవూర

నియోజకవర్గ సమగ్రాభివృద్ధే ధ్యేయం

- ఎమ్మెల్యే బాలునాయక్



గోదాంను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే బాలునాయక్

దేవరకొండ : నియోజకవర్గ సమగ్రాభివృద్ధే తన ధ్యేయమని ఎమ్మెల్యే నేనావత్ బాలునాయక్ అన్నారు. బుధవారం మండలంలోని మర్రిచెట్టుతండాలో రూ.15లక్షల వ్యయంతో మైత్రి ఫార్మర్ ప్రొడ్యూసర్ కంపెనీ, ట్రికార్ నిధులతో నిర్మించిన గోదాంను సూర్యాపేట డీడీఎం రవీందర్‌నాయక్‌తో కలిసి ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడారు. స్థానికంగా ఏర్పాటు చేసిన గోదాంను రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. రాజీవ్ యువ వికాసం పథకంతో నిరుద్యోగుల జీవితాలు మారుతాయన్నారు. రాష్ట్రంలో ఈ పథకం ఒక గేమ్ చేంజర్‌గా మిగులుతుందన్నారు. అన్ని వర్గాల సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. అర్హులైన ప్రతిఒక్కరూ సంక్షేమ పథకాలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో మార్కెట్ చైర్మన్ జమునమాధవరెడ్డి, ఆలంపల్లి నరసింహ, దూదిపాళ్ల వేణుధర్‌రెడ్డి, కొండ్ర శ్రీశైలంయాదవ్, ఎంపీడీఓ డానియల్, శంకర్, కొర్ర గౌతమిరాంసింగ్, కిన్నెర హరికృష్ణ, తదితరులున్నారు.

ఘనంగా వాసవీమాత జయంతి

పట్టణంలోని శ్రీవాసవీ కన్యకాపరమేశ్వరి దేవాలయంలో బుధవారం శ్రీవాసవీమాత జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా దేవాలయంలో వేకువజాము నుంచే అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నేనావత్ బాలునాయక్ ఆలయంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం 16వ వార్డులో సీసీరోడ్డు నిర్మాణ పనులకు ఆయన శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో దేవాలయ కమిటీ సభ్యులు, నాయకులు, భక్తులు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోళ్లు వేగవంతం చేయాలి



మాడ్గులపల్లి : ధాన్యాన్ని పరిశీలిస్తున్న గోలి మధుసూదన్‌రెడ్డి



కొండమల్లేపల్లి : రైతులతో మాట్లాడుతున్న తహసీల్దార్, పీఏసీఎస్ చైర్మన్

మాడ్గులపల్లి : కొనుగోలు కేంద్రాలకు రైతులు తీసుకొచ్చిన ధాన్యాన్ని వెంటనే కొనుగోలు చేయాలని బీజేపీ కిసాన్ మోర్చా జాతీయ నాయకుడు గోలి మధుసూదన్‌రెడ్డి అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని సందర్శించి ధాన్యాన్ని పరిశీలించి మాట్లాడారు. అకాల వర్షానికి ధాన్యం తడిసి రైతులు తీవ్ర ఇబ్బందులు పడే అవకాశం ఉన్నందున రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఎప్పటికప్పుడు ధాన్యాన్ని కొనుగోలు చేయాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల సమయంలో సన్నరకం ధాన్యం క్వింటాకు రూ.500 బోనస్ ఇస్తామని చెప్పి ఇంతవరకు రూపాయి కూడా ఇవ్వలేదని ఆరోపించారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం కొనుగోలు కేంద్రాల్లో రైతులు తీసుకొచ్చిన ధాన్యాన్ని ఎప్పటికప్పుడు కొనుగోలు చేసి తరలించాలని, రైతులకు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలన్నారు. కార్యక్రమంలో జిల్లా కిసాన్ మోర్చా అధ్యక్షుడు గడ్డం వెంకట్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి గుండా నవీన్‌రెడ్డి, పార్టీ మండల అధ్యక్షుడు ఇటికాల జాన్‌రెడ్డి, పాలూరి వెంకట్‌రెడ్డి, సింగిరెడ్డి శ్రీకాంత్‌రెడ్డి, గంగరాజు, బోలగాని ప్రభాకర్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

కొండమల్లేపల్లి : ధాన్యం కొనుగోళ్లు వేగవంతం చేయాలని తహసీల్దార్ నరేందర్, పీఏసీఎస్ చైర్మన్ దూదిపాల వేణుధర్‌రెడ్డి అన్నారు. బుధవారం మండలంలోని చిన్నఅడిశర్లపల్లి గ్రామ సమీపంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని వారు తనిఖీ చేసి రికార్డులను పరిశీలించారు. లారీల యాజమాన్యంతో ఫోన్లో మాట్లాడి త్వరితగతిన లారీలు కేంద్రానికి వచ్చే విధంగా చర్యలు తీసుకోనున్నట్లు తెలిపారు.

లచ్చిరాంనాయక్ సేవలు చిరస్మరణీయం



తిరుమలగిరి (నాగార్జునసాగర్) : లచ్చిరాంనాయక్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్సీ కోటిరెడ్డి

తిరుమలగిరి (నాగార్జునసాగర్) : గిరిజన నేత ఆంగోతు లచ్చిరాంనాయక్ సేవలు చిరస్మరణీయమని ఎమ్మెల్సీ ఎంసీ కోటిరెడ్డి అన్నారు. బుధవారం మండలంలోని రంగుండ్ల గ్రామంలో ఆంగోతు లచ్చీరాంనాయక్ తొమ్మిదో వర్ధంతిలో ఆయన పాల్గొని లచ్చీరాంనాయక్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ ఆంగోతు భగవాన్‌నాయక్, నాయకులు అల్లి పెద్దిరాజు, బీవీ రమణరాజు, కోటియా నాయక్, బాబురావునాయక్, రమావత్ రవికుమార్ నాయక్, మంగ్తానాయక్, శ్రీనునాయక్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

లచ్చిరాం ఆశయ సాధనకు కృషి చేయాలి

హాలియా : గిరిజన సంప్రదాయ సంస్కృతులకు వన్నెతెచ్చిన ఘనత దివంగత నేత ఆంగోతు లచ్చిరాంనాయక్‌కే దక్కిందని ఆయన ఆశయ సాధనకు ప్రతి ఒక్క గిరిజన బిడ్డ కృషిచేయాలని ఆల్ ఇండియా బంజారా సేవా సంఘం రాష్ట్ర నాయకులు దీరావత్ స్కైలాబ్ నాయక్, ఆల్ ఇండియా బంజారా సేవా సంఘం సాగర్ నియోజకవర్గ అధ్యక్షుడు ధనావత్ భాస్కర్‌నాయక్ అన్నారు. బుధవారం పట్టణంలో ఆల్ ఇండియా బంజారా సేవా సంఘం ఆధ్వర్యంలో దివంగత నేత, కాంగ్రెస్ నాయకుడు ఆంగోతు లచ్చిరాంనాయక్ 9వ వర్ధంతిని ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా ప్రధాన సెంటర్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పలువురు గిరిజన సంఘం నాయకులు లచ్చిరాంనాయక్ చిత్ర పటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించి మాట్లాడారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు కుందూరు వెంకట్‌రెడ్డి, పట్టణ అధ్యక్షుడు వెంపటి శ్రీనివాస్, నాయకులు చెరుపల్లి ముత్యాలు, వర్కాల శ్రీనివాస్‌రెడ్డి, కాకునూరి చిన్న నారాయణ, లాయర్ శేఖర్, ఎస్టీ సెల్ నియోజకవర్గ అధ్యక్షుడు పాండునాయక్, రమావత్ నాగేందర్‌నాయక్, రమావత్ సర్దార్ నాయక్, బానోతు సక్రునాయక్, మునినాయక్, మోతిలాల్‌నాయక్, వడ్త్యా రాములునాయక్, బన్సీలాల్ నాయక్, సైదానాయక్, లచ్చిరాం నాయక్ తదితరులు పాల్గొన్నారు.



హాలియా : లచ్చిరాంనాయక్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న నాయకులు

రైతులు గుర్తింపు కార్డులు పొందాలి

అడవిదేవులపల్లి : డిజిటల్ సైన్‌తో పట్టాదారు పాస్‌పుస్తకం కలిగిన రైతులందరూ ఫార్మర్ రిజిస్ట్రర్ పథకం ద్వారా గుర్తింపు కార్డులు పొందాలని మండల వ్యవసాయ శాఖ అధికారిణి గుర్రం సరిత కోరారు. బుధవారం స్థానికంగా ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వ పథకాలు పొందేందుకు 2025 జనవరి 1వతేదీ నాటికి డిజిటల్ సైన్ ఉండాలన్నారు. కేంద్ర ప్రభుత్వ పథకాల అమలుకు ఫార్మర్ రిజిస్ట్రేషన్ అనుసంధానం చేయడం జరుగుతుందన్నారు. రాష్ట్ర ప్రభుత్వానికి సంబంధించిన రైతు భరోసా, రుణ మాఫీ తదితర పథకాలు ఫార్మర్ రిజిస్ట్రర్‌లో ఏ రకమైన సంబంధం లేదన్నారు. రైతులు రైతు విశిష్ట సంఖ్య పొందేందుకు ఆధార్, భూ యాజమాని పాసుపుస్తకం, ఆధార్‌కార్డుకు లింకు చేసిన ఫోన్ నంబరు తీసుకొని ఆయా గ్రామాలకు చెందిన వ్యవసాయ విస్తరణ అధికారిని సంప్రదించి నమోదు చేసుకోవాలన్నారు. ఈ అవకాశాన్ని రైతులు వినియోగించుకోవాలన్నారు.

సీసీ కెమెరాల ఏర్పాటు



సీసీ కెమెరాలు ఏర్పాటు చేయిస్తున్న సీఐ శ్రీనునాయక్, ఎస్‌ఐ సంపత్

నాగార్జునసాగర్ : ప్రపంచ పర్యాటక కేంద్రమైన నాగార్జునసాగర్ సందర్శనకు ఈ నెల 12న ప్రపంచ సుందరీమణులు వస్తున్న నేపథ్యంలో బుద్ధవనం, విజయవిహార్‌లలో బుధవారం సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారు. బుద్ధవనంలో 15సీసీ కెమెరాలు, విజయవిహార్‌లో 15 సీసీ కెమెరాలు ఏర్పాటు చేసినట్లు సాగర్ సీఐ శ్రీనునాయక్ తెలిపారు. అధునాతనమైన సుదూరం కనిపించే కెమెరాలను ఏర్పాటు చేసినట్లు ఆయన తెలిపారు. ఆయన వెంట ఎస్‌ఐ సంపత్ తదితరులు ఉన్నారు.

అర్హులకు ఇందిరమ్మ ఇళ్లు కేటాయించాలని ధర్నా



ధర్నా నిర్వహిస్తున్న బీఆర్ఎస్ నాయకులు

చింతపల్లి : మండల కేంద్రంలో ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారుల ఎంపికలో స్థానిక ఎంపీడీఓ ఇష్టానుసారంగా వ్యవహరించి అధికార పార్టీ కార్యకర్తలకు ఇళ్లు మంజూరు చేస్తున్నారని ఆరోపిస్తూ బుధవారం మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయం ఎదుట బీఆర్ఎస్ నాయకులు ధర్నా నిర్వహించారు. అనంతరం ఎంపీడీఓ సుజాతకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ పార్టీ మండల ఉపాధ్యక్షుడు ఎల్లంకి అశోక్ మాట్లాడారు. మండల కేంద్రంలో 45ఇందిరమ్మ ఇండ్లు ప్రభుత్వం మంజూరు చేయగా లబ్ధిదారుల ఎంపికలో స్థానిక ఎంపీడీఓ, పంచాయతీ కార్యదర్శి ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించి అనర్హులను అర్హులుగా చేర్చారని ఆరోపించారు. ఎంపిక చేసిన లబ్ధిదారుల్లో సుమారు 25మంది వరకు అనర్హులు ఉన్నారని ఆరోపించారు. ఇప్పటికైనా జిల్లా స్థాయి అధికారులు స్పందించి గ్రామంలో ఇల్లు లేని నిరుపేదలను గుర్తించి ఇళ్లు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో గ్రామ శాఖ అధ్యక్షుడు ఎల్లంకి చంద్రశేఖర్, వందనపు ఆంజనేయులు, నల్ల శంకర్, ఎండీ ఖాలేద్, ఎర్ర వెంకటయ్య, మాసాని పెద్దయ్య, ఉప్పల యాదయ్య, అజార్, ఫయాజ్, ధనరాజ్, సిద్ధశ్యామ్, ఊరే భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

'ఆపరేషన్ సింధూర్'పై హర్షం

మిర్యాలగూడ టౌన్ : భారత సైనికులు ఆపరేషన్ సింధూర్ పేరుతో పాకిస్తాన్ ఉగ్రస్థావరాలను మట్టుపెట్టడం పట్ల బీసీ సంఘం నాయకులు బుధవారం హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా యువజన సంఘం ఆధ్వర్యంలో పట్టణంలో స్వీట్లు పంపిణీ చేశారు. అనంతరం బీసీ యువజన సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ తిరుమలగిరి అశోక్ మాట్లాడారు. భారతీయ పర్యాటకులపై కాల్పులు జరిపిన పాకిస్తాన్ ఉగ్రవాదులను అంతం చేయాలని దేశం ముక్తకంఠంతో కోరుతుందన్నారు. కులమతాలకు అతీతంగా ఉంటూ ఐక్యంగా ఉండే భారతదేశం జోలికివస్తే భారత సైన్యం చూస్తూ ఊరుకోదన్నారు. కార్యక్రమంలో బీసీ యువజన సంఘం నాయకులు రమేష్, గోపి, జగదీష్, రవి తదితరులున్నారు.

ప్రిన్సిపాల్‌గా రవికుమార్



నాగార్జునసాగర్ : నందికొండ మున్సిపాలిటీలోని నాగార్జునసాగర్ బీసీ గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్‌గా రవికుమార్ బుధవారం నియమితులయ్యారు. ఆయన వరంగల్ జిల్లా స్టేషన్‌ఘన్‌పూర్ బీసీ గురుకుల పాఠశాలలో పనిచేస్తూ బదిలీ ఇక్కడకు వచ్చారు. ఇప్పటి వరకు ఈ పాఠశాలలో ప్రిన్సిపాల్‌గా పనిచేసిన రాజశేఖర్ నిడమనూరు మండలం వేంపాడు బీసీ గురుకుల పాఠశాలకు బదిలీపై వెళ్లారు. ఈ సందర్భంగా రాజశేఖర్‌ను ఉపాధ్యాయులు, సిబ్బంది శాలువాలు, పూలమాలలతో ఘనంగా సత్కరించారు.

అనుమతి లేని పాఠశాలలపై చర్యలు తీసుకోవాలి



హాలియా : పోస్టర్లు దహనం చేస్తున్న ఏఐఎస్‌ఎఫ్ నాయకులు

దేవరకొండ : పట్టణంలో అనుమతి లేని ప్రైవేటు పాఠశాలలపై అధికారులు చర్యలు తీసుకోవాలని ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా అధ్యక్షుడు ఆకారపు నరేష్ డిమాండ్ చేశారు. బుధవారం ఎస్‌ఎఫ్‌ఐ డివిజన్ కమిటీ ఆధ్వర్యంలో శ్రీ చైతన్య పాఠశాలకు సంబంధించి అంటించిన ఫ్లెక్సీ బ్యానర్స్ తొలగించారు. అనంతరం ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో డివిజన్ కార్యదర్శి బుడిగ వెంకటేష్, కార్తీక్, అర్జున్, నాని, మనోహర్, తదితరులున్నారు.

హాలియా : ప్రభుత్వం అనుమతులు లేకుండా విద్యార్థుల నుంచి అడ్మిషన్లు తీసుకుంటున్న శ్రీ చైతన్య పాఠశాల యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని ఏఐఎస్‌ఎఫ్ జిల్లా కార్యదర్శి ముదిగొండ మురళికృష్ణ అన్నారు. ఏఐఎస్‌ఎఫ్ సంఘం ఆధ్వర్యంలో బుధవారం పట్టణంలో శ్రీ చైతన్య పాఠశాల వాల్‌పోస్టర్లు, కరపత్రాలను దహనం చేసి మాట్లాడారు. ఖమ్మం బ్రాంచ్‌కి చెందిన శ్రీ చైతన్య కార్పొరేట్ యాజమాన్యం ఎలాంటి అనుమతి లేకుండా హాలియా, దేవరకొండ ప్రాంతాల్లో బ్రాంచీలు ఏర్పాటు చేసి అడ్మిషన్లు నిర్వహిస్తున్నారన్నారు. ప్రభుత్వ అధికారులు వెంటనే స్పందించి ఆ పాఠశాలను రద్దు చేసి యాజమాన్యంపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు రమావత్ శోభన్‌బాబు, కిరణ్, మహేష్, రవి, శ్రీకాంత్ తదితరులు ఉన్నారు.

ఎస్‌ఎఫ్‌ఐ ఆధ్వర్యంలో నిరసన..

హాలియాలో అనుమతి లేకుండా అడ్మిషన్లు నిర్వహిస్తున్న శ్రీ చైతన్య పాఠశాలపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ ఎస్‌ఎఫ్‌ఐ ఆధ్వర్యంలో పాఠశాల ఫ్లెక్సీ బానర్లను తొలగించి నిరసన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో సంఘం సాగర్ డివిజన్ అధ్యక్ష, కార్యదర్శులు జగదీష్, కోరే రమేష్, డివిజన్ కమిటీ నాయకులు వర్షిత్, సాయి తదితరులు ఉన్నారు.

మహిళల భద్రత కోసమే షీ టీంలు ఏర్పాటు



అవగాహన కార్యక్రమంలో పాల్గొన్న షీ టీం సిబ్బంది, డాక్టర్లు, మహిళలు

మిర్యాలగూడ అర్బన్ : మహిళల భద్రత కోసమే షీ టీం ఏర్పాటైందని, ఎవరికైనా ఆకతాయిలతో వేధింపులు జరిగినప్పుడు షీ టీం దృష్టికి తీసుకురావాలని షీ టీం ఎస్‌ఐ కె.నరేష్ అన్నారు. బుధవారం పట్టణంలోని జ్యోతి ఆస్పత్రిలో షీటీం ఆధ్వర్యంలో మహిళలకు ఏర్పాటు చేసిన అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. సోషల్ మీడియా, మెసేజ్‌లు, ఫోన్‌కాల్స్ ద్వారా వేధింపులకు ఎలా గురవుతారు, అలాంటి సమస్యలు ఎదురైనప్పుడు ఏమి చేయాలి, అనే అంశాలను వివరించారు. సహాయం కోసం 100, 112, 181లకు ఫోన్ చేయడంతో ఆపదలో ఉన్న మహిళలు తక్షణ సహాయం పొందవచ్చని తెలిపారు. కార్యక్రమంలో డాక్టర్ జీవనజ్యోతి, ఏఎస్‌ఐ తబిత పాల్గొన్నారు.

సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలి



ప్రచారంలో పాల్గొన్న సీఐటీయూ నాయకులు

మిర్యాలగూడ : ఈ నెల 20నుంచి దేశవ్యాప్తంగా నిర్వహించే సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని సీఐటీయూ దామరచర్ల మండల కార్యదర్శి బైరం దయానంద్ అన్నారు. ఈ సందర్భంగా బుధవారం వివిధ శాఖల అధికారులకు సంఘం ఆధ్వర్యంలో సమ్మె నోటీసులు అందజేసి ఆయన మాట్లాడారు. కార్మికులకు కనీస వేతనం అమలు చేయడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పూర్తిగా విఫలమయ్యాయని, కార్మికుల హక్కులను కాలరాసేందుకు కేంద్ర ప్రభుత్వం తీసుకొస్తున్న చట్టాలను వెంటనే రద్దు చేయాలన్నారు. కార్మికుల ప్రయోజనాల కోసం చేపడుతున్న సమ్మెలో కార్మికులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలన్నారు. కార్యక్రమంలో నాయకులు పాల్గొన్నారు.

బోర్డులకే పరిమితమా!



బంగారికుంట తండాలో బోర్డుకే పరిమితమైన క్రీడా ప్రాంగణం



అడవిదేవులపల్లి మండలం ఉల్సాయిపాలెంలో నిరుపయోగంగా ఉన్న క్రీడా ప్రాంగణం

- నిరుపయోగంగా క్రీడా ప్రాంగణాలు
- వినియోగంలోకి తీసుకురావాలని కోరుతున్న క్రీడాకారులు

అడవిదేవులపల్లి : గ్రామీణ ప్రాంతాల్లోని యువతను క్రీడల్లో ప్రోత్సహించాలనే ఉద్దేశంతో ప్రతి గ్రామంలో తెలంగాణ గ్రామీణ క్రీడా ప్రాంగణాల ఏర్పాటు కేవలం బోర్డులకే పరిమితమయ్యాయి. 2021లో అప్పటి ప్రభుత్వం క్రీడా ప్రాంగణాలకు ఏర్పాటుకు శ్రీకారం చుట్టింది. శారీరక దారుఢ్యం, మానసిక ఉల్లాసానికి, క్రీడా నైపుణ్యాన్ని వెలికి తీసేందుకు దోహదపడేలా క్రీడా ప్రాంగణాలను నిర్మించారు. అయితే క్రీడా ప్రాంగణాలకు స్థల ఎంపిక సమస్యగా మారింది. ఒక ఎకరం కూడా లేక అనువైన ప్రభుత్వ స్థలాలు దొరకకపోవడంతో ఎక్కడపడితే అక్కడ ప్రాంగణాలను ఏర్పాటు చేశారు. అప్పట్లో గ్రామ పంచాయతీ కార్యదర్శుల రెగ్యులరైజేషన్‌కు అన్ని పథకాలు ప్రారంభం జరిగినట్లు చూపించాల్సిన ఉండటంతో హడావుడి అనువుకాని చోట స్థలాల ఎంపిక చేసి బోర్డులను పాతించి చేతులు దులుపుకున్నారు. అప్పటి కలెక్టర్ ప్రత్యేక నిధుల నుంచి పరికరాలను కొనుగోలు చేసి సరఫరా చేసిన నాలుగు పరికరాలను మాత్రమే ఏర్పాటు చేశారు. ఆ తరువాత మహాత్మాగాంధీ జాతీయ ఉపాధి హామీ పథకం కింద రూ.87వేల అంచనాలతో పూర్తిస్థాయిలో అందుబాటులోకి తీసుకురావాల్సి ఉండగా వీటిపై ప్రభుత్వం ఎలాంటి దృష్టిని సారించలేకపోవడంతో అంతటితో నిలిచిపోయింది. సరఫరా చేసిన వాటిలో వాలిబాల్, హైజంప్, లాంగ్ జంప్, పుష్పుల్ బాల్ వంటివి అరకొరగానే ఏర్పాటు చే శారు. క్రికెట్ కిట్లు, టి షర్టులు సరఫరా చేసినప్పటికి అవి ఎక్కడున్నాయో కూడా తెలియదు.

మొత్తం 14క్రీడా కేంద్రాలు

మండలంలోని 13గ్రామ పంచాయతీలు ఉండగా 14క్రీడా కేంద్రాలను ఏర్పాటు చేశారు. ప్రతి గ్రామంలో క్రీడా ప్రాంగణాలను ఏర్పాటు చేశారు. అయితే స్థలాలు లేకపోవడంతో క్రీడా ప్రాంగణాలు ఎక్కడపడితే అక్కడ ఏర్పాటు చేశారు. కాగా అడవిదేవులపల్లి గ్రామంలో ప్రభుత్వ స్థలం లేకపోవడంతో గ్రామ సమీపంలోని ఎస్టీ బాలుర వసతి గృహం సమీపంలో క్రీడా ప్రాంగణంను ఏర్పాటు చేశారు. క్రీడా ప్రాంగణాలకు పోల్స్‌లు నాణ్యత లేకపోవడంతో నిరుపయోగంగా మారాయి. అదే విధంగా మండలంలోని ఉల్సాయిపాలెం గ్రామంలో ఖాళీ స్థలం లేకపోవడంతో రోడ్డు పక్కనే ఉన్న పంట పొలం వద్ద బోర్డులతో పాటు స్తంభాలు ఏర్పాటు చేశారు. ఘొల్కచర్లలో స్థలం లేకపోవడంతో పల్లె పకృతి వద్ద క్రీడా ప్రాంగణాన్ని ఏర్పాటు చేశారు. మండలంలో మొత్తం 13 గ్రామ పంచాయితీలుండగా అన్ని చోట్ల క్రీడా ప్రాంగణాల బోర్డులను ఏర్పాటు చేశారు. మరి కొన్ని చోట్ల క్రీడా ప్రాంగణాల స్థలాలను ఎంపిక చేశారు.

> **అందుబాటులోకి తీసుకురావాలి**
>
> 
>
> తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన క్రీడా ప్రాంగణాలను క్రీడాకారులకు, యువకులకు అందుబాటులోకి తీసుకురావాలి. అధికారులు అనువైన స్థలాలు సేకరించి మరల క్రీడా ప్రాంగణాన్ని ఏర్పాటు చేసి క్రీడాకారులను అందుబాటులోకి తీసుకురావాలి.
>
> – పచ్చపాల లింగయ్య, అడవిదేవులపల్లి